క్లుప్తంగా

లీగల్ అడ్వైజర్ ఎంపిక


సాయిశివకేశవ

కడప ఎడ్యుకేషన్ : సమాజ సేవా సమితి కడప జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడిగా కొప్పరపు సాయి శివకేశవను నియమించినట్లు సమాజ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు అడ్వకేట్ వాండ్రాసి పెంచలయ్య తెలిపారు. ఈ సందర్భంగా శివకేశవ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమాజ సేవా సమితి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి సాయం


హెడ్ కానిస్టేబుల్ సతీమణి జయలక్ష్మికి చెక్కు అందజేస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ ఎం.నాగార్జునరెడ్డి(హెచ్.సి 1071) కుటుంబానికి ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ ఆర్థిక సాయం అందించారు. సాయం చేశారు. పోలీసు వితరణ నిధి నుంచి రూ.2.5 లక్షల చెక్కును జిల్లా పోలీస్ కార్యాలయంలో నాగార్జునరెడ్డి సతీమణి జయలక్ష్మికి మంగళవారం అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ కుటుంబ యోగక్షేమాలు విచారించిన ఎస్పీ అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరం అన్నారు. పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కె.ప్రకాష్‌బాబు, ఏఓ కె.వెంకటరమణ, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, ఏ్రపిన్ పాల్గొన్నారు.

కార్యకర్తపై దాడి చేయడం దారుణం


అంగన్‌వాడీ కార్యకర్త చేతిపై దెబ్బలు

కడప కోటిరెడ్డి సర్కిల్ : నగరంలోని మాసాపేట సెక్టార్‌లోని సున్నపురాళ్లపల్లె మిట్ట–1 అంగన్‌వాడీ కేంద్రం వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. ఇక్కడ పనిచేస్తున్న అంగన్‌వాడీకార్యకర్త తరచూ గొడవపడుతుంటారని లబ్ధిదారులు తెలిపారు. ఐదు రోజుల క్రితం అంగన్‌వాడీ కార్యకర్తపై ఒకరు దాడి చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఇరువురూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు తెలిసింది. కార్యకర్తపై కింది స్థాయి ఉద్యోగి భౌతికంగా దాడి చేసినా అధికారులు చోద్యం చూస్తుండటంపై విమర్శలకు తావిస్తోంది. ఇద్దరి మధ్య జరిగిన ఘటనపై నివేదికను ఇప్పటికే ఐసీడీఎస్ పీడీకి పంపించారు. పీడీ రమాదేవి మంగళవారం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి ఇరువర్గాలతో మాట్లాడారు. అయితే ఎవరినో ఒకరిని పక్క కేంద్రానికి తరలిస్తే ఈ సమస్య పరిష్కారమవుతుందని లబ్ధిదారులు పేర్కొన్నారు.

మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించుకోవాలి


సమస్యలను వింటున్న రమేష్

కడప కోటిరెడ్డి సర్కిల్ : మాజీ సైనికులు, వితంతువులు, వారిపై ఆధారపడిన వారంతా తమ సమస్యలను తెలియజేసి పరిష్కరించుకోవాలని మద్రాసు రెజిమెంటర్ సెంటర్ ప్రతినిధులు సుబేదార్ బి.రమేష్ తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో మాజీ సైనికుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సైనిక కుటుంబీకుల సమస్యలను ఆయన విన్నారు. ఈ కార్యక్రమంలో సైనిక సంక్షేమ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


స్పోర్ట్స్ స్కూల్‌కు నలుగురు విద్యార్థుల ఎంపిక

కమలాపురం : మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికై నట్లు పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఫిజికల్ డైరెక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. వేదాస్ స్కూల్‌కు చెందిన సయ్యద్‌మహ్మద్ ఇర్ఫాన్ (5వ తరగతి), కశ్యప్ (5వ తరగతి), పెద్దచెప్పలి ఎంపీపీ స్కూల్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి (5వ తరగతి), వివేకానంద స్కూల్‌కు చెందిన అర్జున్ (4వ తరగతి)లు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికైనట్లు ఆయన వివరించారు. ప్రతి రోజు సాయంత్రం పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్‌లో ఈ విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో పీడీ సునీల్‌కుమార్ శిక్షణ నిచ్చారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించాలనే పట్టుదల ఉండటంతో ఈ విద్యార్థులు ప్రతి రోజు క్రీడల్లో సాధన చేసేవారు. ఈనెల 21వ తేదీన వారు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు పొందుతారని పీడీ వివరించారు. గత ఏడాది స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు చేపట్టక పోవడంతో ఈ ఏడాది 4, 5వ తరగతుల విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారని ఆయన వివరించారు. కాగా తమ పిల్లలు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యేలా శిక్షణ నిచ్చిన పీడీ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు.

జైళ్ల శాఖ పెట్రోల్ బంకుల్లో

ఏం జరుగుతోంది?

- కడప రేంజ్ డీఐజీ పరిధిలోని ధర్మవరం, బనగానపల్లి పెట్రోల్ బంక్‌ల్లో అవినీతి
- ధర్మవరం పెట్రోల్ బంకులో రూ.20 లక్షల అవినీతి వ్యవహారంలో నలుగురి చేతివాటం
- బనగానపల్లి పెట్రోల్ బంకులో రూ. 60 లక్షల మేర అవినీతి
- కర్నూలు డీఎస్‌డీ, బనగానపల్లి డిప్యూటీ జైలర్, ఓ హెడ్ వార్డర్ చేతివాటం



సాక్షి, టాస్క్‌ఫోర్స్ : జైళ్ల శాఖ కడప రేంజ్ డిఐజీ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో అవినీతి తవ్వేకొద్దీ రోజురోజుకూ బయట పడుతోంది. పలువురు సిబ్బంది బంకుల్లోని సొమ్ము కాజేసినట్లు తెలుస్తోంది. ప్రధానంగా అనంతపురం జిల్లా ధర్మవరం పెట్రోల్ బంకు పరిధిలో అప్పటి డీఐజీ, అనంతపురం డీఎస్‌డీఓ, అక్కడ జైలర్‌గా పనిచేస్తూ బదిలీపై కడప కేంద్ర కారాగారానికి వచ్చిన మరో జైలర్, ధర్మవరం డిప్యూటీ జైలర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం తాడిపత్రికి బదిలీపై వెళ్లిన డిప్యూటీ జైలర్ ఈ వ్యవహారంలో చేతివాటం ప్రదర్శించినట్లు తెలిసింది. సదరు డిప్యూటీ జైలర్ పెట్రోల్ బంకు నిర్వహణ ఛార్జ్ డీఎస్‌డీఓకు అప్పగించే క్రమంలో ఈ లొసుగులు బయటపడినట్లు తెలిసింది. రూ.20 లక్షల పెట్రోల్ బంకు డబ్బులు, 1.50 లక్షలు పీపీసీ (ప్రిజనర్స్ పార్టిసిపేషన్ క్యాష్) తక్కువగా ఉండడంతో డీఎస్‌డీఓ ఛార్జ్ తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో ప్రస్తుతం వార్డర్‌లే పెట్రోల్ బంకు నిర్వహిస్తున్నారు. అప్పటి కీలక అధికారి పెద్ద మొత్తంలో డబ్బును తన అవసరాలకు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ అధికారి తీసుకున్న మొత్తం డబ్బు బంధువులు, వార్డర్స్ ఫోన్‌పేల రూపంలో చెల్లించినట్లు సమాచారం. డిప్యూటీ జైలర్ తాను చెల్లించాల్సిన డబ్బును చెల్లించకపోవడం, ఇతర కారణాలతో అప్పట్లో డిపార్ట్‌మెంట్ అతడిని డిస్మిస్ చేసింది. ఆ డిప్యూటీ జైలర్ వాడుకున్న మొత్తాన్ని ఎవరు కట్టాలో.. దిక్కుతోచక ఒక కమిటీని నియమించి కడప రేంజ్ డిఐజీ విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

ఇక బనగానపల్లి మాటేమిటో.....!

కడప రేంజ్ డిఐజీ పరిధిలో వున్న మరో పెట్రోల్ బంక్ బనగానపల్లిలో వుంది. ఈ పెట్రోల్ బంకులో రూ. 62 లక్షల మేరకు అవినీతి జరిగింది. ఈ అవినీతికి పాల్పడిన వారిలో ప్రధానంగా కర్నూలు డీఎస్‌డీఓతో పాటు, డిప్యూటీ జైలర్, ఓ హెడ్ వార్డర్ చేతివాటం ఉన్నట్లు తెలిసింది. ఇందులో డీఎస్‌డీఓకు 23 కారులు రావడంతో విచారణకు సిద్ధమని, అందరినీ బహిరంగంగా విచారించాలని పట్టుబట్టాడు. అడిషనల్ ఎస్పీ ర్యాంక్‌తో పదోన్నతి కల్పించేందుకు రంగం సిద్ధమైంది. ఈ క్రమంలో బనగానపల్లి పెట్రోల్ బంకు వ్యవహారం బయటకు రాకుండా డీఎస్‌డీఓకు అనుకూలమైన ప్రస్తుత కీలక అధికారి తమ వంతు విచారణ జరగకుండా తొక్కిపెట్టినట్లు సమాచారం. ఐతే ఒక హెడ్ వార్డర్ బనగానపల్లిలోని పెట్రోల్ బంకు నిర్వహిస్తూ ఇటీవల ఆళ్లగడ్డకు బదిలీ అయ్యాడు. ఈ క్రమంలో బనగానపల్లి పెట్రోల్ బంకు అవినీతి బయటపడింది. ఆళ్లగడ్డలో రిపోర్ట్ చేసుకోవాల్సిన హెడ్ వార్డర్ ఉన్నతాధికారుల ఇబ్బందులతో వాడుకున్న డబ్బులను జీపీఎఫ్ ద్వారా డబ్బులను డ్రా చేసి రూ. 10 నుంచి 12 లక్షల మేరకు చెల్లించినట్లు సమాచారం. డిప్యూటీ జైలర్ తన పరిధిలో తాను వాడుకున్న మొత్తంలో రూ. 10 లక్షల మేరకు కట్టినట్లు సమాచారం. డీఎస్‌డీఓ పరిధిలో రూ.15 లక్షల మేర చెల్లించారు. మిగిలిన రూ. లక్షలను హెడ్ వార్డర్‌ను చెల్లించాలని ఉన్నతాధి ఒత్తిడి తీసుకుని తాను

● ఇది మునిసిపల్ రోడ్డే..!



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కడప నగర పాలక సంస్థలోని శివారు డివిజన్లలో రహదారులు అధ్వానంగా మారాయనడానికి ఈ చిత్రాలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. చినుకు రాలితే చాలు.. ఇదిగో ఇలా రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. నిత్యం ఈ రోడ్డు గూండా రాకపోకలు సాగించే ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.
– సాక్షి ఫోటో గ్రాఫర్, కడప.



సీనియర్ ఫొటోగ్రాఫర్‌కు సత్కారం


ఫొటోగ్రాఫర్‌ను సన్మానిస్తున్న కొండా సుబ్బయ్య


సమీవుల్లాను సత్కరిస్తున్న పఠాన్ ఖాదర్‌బాషా

కడప ఎడ్యుకేషన్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కడపలోని సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎస్ఎండీ.ఖాసీంసాగర్‌ను మంగళవారం ఘనంగా సత్కరించారు. కొండ పాలకొండయ్య ట్రస్ట్ చైర్మన్ కొండా సుబ్బయ్య ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 1986 నుంచి ఖాసీం డీపీఆర్ఓ, నగర మున్సిపల్ కార్యాలయాల్లో ఫొటోగ్రాఫర్‌గా సేవలందించారన్నారు. జిల్లా కేంద్రంలో ఎందరో ఫొటోగ్రాఫర్లను తయారు చేసి, వారు రాణించేలా ఆయన కృషి చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ ఫొటోగ్రాఫర్లకు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ముస్లిం ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీఖాన్, ఆర్కే సేవా సమితి అధ్యక్షుడు అబ్దుల్ రాయల్ కరీముల్లా, అల్లాప్రకాష్, మక్బూల్‌బాషా, తదితరులు పాల్గొన్నారు,

సన్మానం

కడప సెవెన్‌రోడ్స్ : మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ షబ్బీర్ ఆధ్వర్యంలో సాగర్ ఫోటో స్టూడియోలో సాగర్ షేక్ ఖాశీంను ఘనంగా మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేకే ప్రాజెక్ట్ గ్రూప్స్ అధినేత షేక్ ఖాజామొయినుద్దీన్, షౌకత్ అలీ, సర్ఫరాజ్ అలీ, నాగూర్, యూసుఫ్, సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ ఒక కళ

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఫొటోగ్రఫీ ఒక కళ, నైపుణ్యం అని.. యువకులు ఫొటోగ్రఫీ ద్వారా సొంతంగా తమ కాళ్లపై నిలబడి పదిమందికి ఉపాధి చూపించాలని యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా తెలిపారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా కడప నగరంలోని జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో యువ ఫొటోగ్రాఫర్ సమీవుల్లాను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్జాన్, సలీం, సయ్యద్, శివ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు విద్యను దూరం చేసే జీఓను రద్దుచేయాలి


డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నేతలు

కడప సెవెన్‌రోడ్స్ : పేద, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య దూరం చేస్తున్న జీఓ నెంబరు 77ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దుచేయాలని ప్రగతి శీల రెవెల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శంకర్ కోరారు. డీఆర్వో విశ్వేశ్వర నాయుడును మంగళవారం ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెం.77తో రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులు ఉన్నత, సాంకేతిక విద్య అభ్యసించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. యువగళం పాదయాత్ర, ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేష్ జీఓ రద్దుకు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వ వర్సిటీల్లో పీజీ సీటు రాకపోతే ప్రైవేటు కళాశాలల్లో చదవాలంటే ఏటా రూ.45వేలు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఆర్థిక పరిస్థితి సరిగా లేక చాలామంది విద్యార్థులు మధ్యలోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారని తెలిపారు. జీఓను తక్షణమే రద్దు చేసి ఎన్నికల హామీ నెరవేర్చకపోతే ఆందోళన చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, వేణు తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారుల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది


మాట్లాడుతున్న ఏఐసీసీ కో ఆర్డినేటర్ సత్తార్

కడప వైఎస్సార్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డదారుల్లో అధికారంలోకి వచ్చిందని ఏఐసీసీ కో ఆర్డినేటర్ ఎస్.ఎ.సత్తార్, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రవిశంకర్‌రెడ్డి అన్నారు. నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఓటు చోరీపై చర్చావేదిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీబీఐ, ఈడీ, ఐటీలను ఉపయోగించుకొని బీజేపీ అడ్డదారుల్లో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ 70 నిమిషాల పాటు చేసిన ప్రజెంటేషన్‌లో బ్రతికిన వారు చనిపోయినట్లు, ఒకే గది ఉన్న ఇంటిలో 80 మంది ఓటర్లు ఉన్నట్లు, ఒక అపార్ట్‌మెంట్‌లో 7 వేల ఓటర్లు ఉన్నట్లు జాబితాలో లోపాలను బయటపెట్టారన్నారు. ఇండియా టుడే విచారణ జరిపి దీనిని నిర్ధారించిందన్నారు. ఎన్నికల అవకతవకలపై దేశ ప్రజలకు వివరణ ఇచ్చుకోవాల్సిన ఎన్నికల కమిషన్ తప్పులపై అఫిడవిట్ కోరడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందన్నారు. త్రిసభ్య కమిటీలో ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు జడ్జి, ప్రతిపక్ష నాయకుడు ఉండేవారని, ఇప్పుడు కొత్తగా ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి ,ప్రతిపక్ష నాయకుడు ఉండే విధంగా చట్టసవరణ చేశారన్నారు. డిజిటల్ లిస్టు ఎన్నికల అనంతరం ధ్వంసం చేశామని చెప్పడం అవినీతి జరిగిందనడానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి బండెల ఓబయ్య, మల్లెలభాస్కర్, నాసిర్‌హుస్సేన్, సీఆర్‌వీ.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శాంతి హోమం


మూలమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కడప సెవెన్‌రోడ్స్ : దేవునికడప లక్ష్మీ వేకటేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టిన నేపథ్యంలో బాలాలయ ప్రతిష్ఠలో భాగంగా రెండవ రోజున మంగళవారం ఉదయం అర్చకులు మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్, కృష్ణ తరుణ్, పాంచరాత్ర ఆగమ సలహాదారు రాజేష్ భట్టర్ వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శాంతిహోమం, వాస్తు హోమం, కర్మాంగ స్నపనం శాస్త్రబద్ధంగా నిర్వహించారు. సాయంత్రం కళాకర్షణ, సయ్యాధివాసం, మూర్తి హోమం చేపట్టారు. గర్భాలయంలోని వేంకటేశ్వరస్వామి మూలమూర్తి శక్తిని కుంభం లోకి ఆవాహన చేసి యాగశాలలో ప్రతిష్ఠించి ఆరాధన చేశారు. టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.ఈశ్వర్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

దుర్గమ్మ ఆలయంలో రాహుకాల పూజలు


పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

కడప సెవెన్‌రోడ్స్ : కడప విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున విజయదుర్గ అమ్మవారికి పంచామృత అభిషేకం, అనంతరం షోడశోపచార పూజలు జరిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాహుకాల పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి మంగళవారం కావడంతో వందలాది మంది పూజలో పాల్గొని అమ్మకు ప్రీతిపాత్రమైన నిమ్మదీపాలు వెలిగించి నవగ్రహ పూజ చేశారు. పూజలకు హాజరైన భక్తులకు అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జున రావు, దుర్గాప్రసాద్ పూజలను పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని

మున్సిపల్ కార్మికుల వినతి


సీడీఎంఏ సంపత్‌కుమార్‌కు విన్నవిస్తున్న కార్మికులు

కడప కార్పొరేషన్ : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్ కుమార్‌ను మంగళవారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప కార్పొరేషన్‌లో ఐదుగురు కార్మికులు చనిపోయి మూడు నెలలవుతున్నా, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. తొమ్మిది మంది డ్రైవర్లకు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అడిషనల్ కోవిడ్ కార్మికులకు కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్ ప్రకారం ఒక రోజు వేతనం రూ.596 రూపాయలు ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 124ను వర్తింపజేయాలని, సమ్మె కాలపు వేతనం ఇవ్వాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, పదోన్నతులు కల్పించి రావాల్సిన బెనిఫిట్లు ఇవ్వాలన్నారు. కడపలో వర్కర్స్‌గా ఉన్న 14 మంది డ్రైవర్లకు వేతనం పెంచాలన్నారు. రిటైర్మెంట్ వయసు 62కు పెంచి బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. మాసాపేట రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి పక్కా ఇళ్లు నిర్మించాలన్నారు. కార్మికులకు పండుగ సెలవులు ప్రకటించాలని కోరారు. వీటిపై సీడీఎంఏ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు కె. తిరుపాల్, నగర సహాయ కార్యదర్శి ఇ. ప్రకాష్, నగర మున్సిపల్ డ్రైవర్ యూనియన్ కార్యదర్శి ఎస్. కిరణ్ పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లను రెగ్యులరైజేషన్ చేసుకోండి

ప్రొద్దుటూరు రూరల్ : ప్రొద్దుటూరులో నెలకొన్న అనధికార లే అవుట్లను రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని కడప పట్టణాభివృద్ధి సంస్థ ప్లానింగ్ అధికారి శైలజ పేర్కొన్నారు. మండలంలోని హౌసింగ్‌బోర్డు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు, ఎల్‌టీపీలకు అనధికారక లే అవుట్లు, ప్లాట్ల రెగ్యులరైజేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనధికారిక లే అవుట్లు, ప్లాట్లను గత నెల 26 నుంచి నుంచి 90 రోజుల్లోగా దరఖాస్తు చేసుకుని రెగ్యులరైజ్ చేసుకోవచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీఓ నంబర్ 134 ప్రకారం 2025 జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు, లే అవుట్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెగ్యులరైజేషన్ చేసుకోవచ్చన్నారు. రెగ్యులరైజేషన్ కోసం ఎల్ఆర్ఎస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్లాట్ల యజమానులే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్లాట్ సైజ్, భూమి ప్రభుత్వ విలువ ఆధారంగా చార్జీలు ఉంటాయన్నారు. లే అవుట్‌లో ఓపెన్ స్పేస్ లేనప్పుడు 50 శాతం రాయితీతో భూమి విలువపై 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎల్‌టీపీలు ప్లాట్ల, లే అవుట్ల యజమానులకు ఈ విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించండి

కమలాపురం : పంటలు సాగు చేసిన రైతులు తమ పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలు పాటించి పంటలను కాపాడుకోవాలని ఏరువాక డాట్ సెంటర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ అంకయ్య కుమార్, ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి ప్రధాన శాస్త్రవేత్త సునీల్‌కుమార్, మాధురి తెలిపారు. మంగళవారం మండలంలోని దాదిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో సాగులో ఉన్న వరి, మినుము పంటలను వారు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం ఏడీఏ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాల కారణంగా మినుము పంటకు బూడిద తెగులు ఆశించిందన్నారు. దాని నివారణకు 2 గ్రాముల సాఫ్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. లేదా 2 మి.లీ. హెక్సా కోనోజల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే వరిలో బ్యాక్టీరియా ఆకుమాడు తెగులు ఆశించిందని, దీని నివారణకు ఏకరాకు 25 నుంచి 30 కిలోల పొటాష్ ఎరువులను వాడాలన్నారు. జల్లులు పడుతూ మోడంగా ఉన్న సమయంలో నత్రజని ఎరువులను వాడరాదన్నారు. కాండం తొలుపు పురుగు ఉంటే 0.3 మి.మీ. క్రోరాజన్, 0.5 మి.లీ. ప్లై బెండమైడ్ కలిపి పిచికారి చేయాలన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో వరి 1500 హెక్టార్లలో, మినుము 250 హెక్టార్లు, వేరు శనగ 300 హెక్టార్లు, పత్తి 350 హెక్టార్లలో సాగులో ఉందన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న

మట్టిగణపయ్యలు




మట్టి వినాయక ప్రతిమకు రూపుదిద్దుతున్న మహిళ

కడప నగరంలో మట్టి గణపతులకు భలే గిరాకీ ఉంటుంది. పర్యావరణానికి హాని కలగకుండా కొందరు మట్టి గణపతులను తయారుచేస్తున్నారు. నగరానికి చెందిన పాలెంపల్లెలోని కుమ్మరి కులస్థులు 40ఏళ్లుగా కుండలు తయారుచేస్తారు. వినాయక చవితి పండగ కోసం చినుకులు పడుతున్నా.. ఎంతో శ్రమకోర్చి బొమ్మలు తయారుచేస్తున్నారు. – సాక్షి ఫోటోగ్రాఫర్, కడప